ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- డ్రోన్ టెక్నాలజీ భవిష్యత్తులో కీలకం కానుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- మొబైల్ ద్వారా సర్టిఫికెట్లు, పౌరసేవలు అందించేలా మెటాతో ఒప్పందం చేసుకున్నామని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు.
- ఇటీవల వర్షాల కారణంగా వైరల్ జ్వరాల బారిన పడిన రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలను కల్పించామని మంత్రి వాసంశెట్టి శుభాష్ అన్నారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 115వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.
- తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రేపటికి తుఫానుగా మారే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

===================

డ్రోన్ టెక్నాలజీ భవిష్యత్తులో కీలకం కానుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో ఈరోజు అమరావతి డ్రోన్ సమ్మిట్-2024 జాతీయ సదస్సును చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ ప్రస్తుతం నిజమైన సంపద డేటా అని భవిష్యత్తులో దేశానికైనా, ఏ వాణిజ్య సంస్థకైనా అదే కీలకమన్నారు. డేటాకు కృత్రిమ మేధస్సును అనుసంధానిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని పేర్కొన్నారు. ఇటీవల విజయవాడ వరదల్లో డ్రోన్లు వినియోగించి ఆహారం, తాగునీరు అందించామని గుర్తుచేశారు. పౌర విమానయాన శాఖ, భారత పరిశ్రమల సమాఖ్య సీఐఐ ఆర్థికాభివృద్ధి సంస్థ డీఎఫ్ఐ భాగస్వామ్యంతో రెండు రోజులపాటు ఈ సదస్సు నిర్వహిస్తున్నారు.

===================

మొబైల్ ద్వారానే వివిధ రకాల సర్టిఫికెట్లు, పౌరసేవలు అందించేలా మెటాతో ఒప్పందం చేసుకున్నామని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. న్యూఢిల్లీలోని జన్‌పథ్‌లో ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, మెటా మధ్య పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగులు వివిధ సర్టిఫికెట్ల కోసం పడుతున్న కష్టాలు యువగళం పాదయాత్ర సందర్భంగా ప్రత్యక్షంగా చూశానన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వాట్సప్ ద్వారానే సర్టిఫికెట్లు, పౌరసేవలు అందించేలా మెటాతో ఒప్పందం చేసుకున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవలు ఆన్‌లైన్‌లో అతి సులువుగా, పారదర్శకంగా, అతి వేగంగా పొందే ఏర్పాట్లు చేస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెటా సంస్థ ప్రతినిధులు రవిగార్గ్, నటాషా, ఆర్టీజీఎస్ సీఈవో దినేశ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

===================

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిఎస్ఆర్ నిధుల ద్వారా రామచంద్రాపురం ఆసుపత్రిని 50 నూతన పడకలతో విస్తరించామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ఆసుపత్రిని ఈరోజు మంత్రి సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. ఇటీవల వర్షాలకు వైరల్ జ్వరాల బారిన పడిన రోగులకు మరిన్ని సదుపాయాలను కల్పించామని మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ..

వాయిస్ బైట్.. మంత్రి సుభాష్ (వాయిస్ 22 సెకన్లు)

===================

డయేరియా వ్యాధి ప్రబలడానికి గల కారణాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తో కలిసి ఈ

రోజు జిల్లాలోని గుర్ల గ్రామంలో పర్యటించారు. ఆ గ్రామంలోని పారిశుద్యాన్ని, త్రాగునీటి పైప్ లైన్లను పరిశీలించి, నీటి సరఫరా గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ రోగులకు ఇస్తున్న మందులు, ఫార్మసీ విభాగాన్ని పరిశీలించారు.

===================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 115వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

===================

విరామం

===================

తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఉన్న వాయుగుండం రేపటికి తుఫానుగా మారే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. 24వ తేదీ నాటికి ఇది తీవ్ర తుఫానుగా బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి తెలియజేస్తూ..

(వాయిస్ 36 సెకన్లు)

===================

తుఫాను కారణంగా ఈ నెల 23 నుంచి 25 వరకు పార్వతీపురం మన్యం జిల్లాలో ఈదురుగాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈరోజు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అధికారులు సమన్వయంతో పని చేసి ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కొండవాలు ప్రాంతాలు, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆయన ఆదేశించారు.

===================

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ, కేంద్ర గృహ నిర్మాణం పట్టణ వ్యవహారాల శాఖా మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ఈరోజు న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులపై ఇరువురు చర్చించారు. ఈ రెండు మెట్రో ప్రోజెక్టులపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని మంత్రి నారాయణ కేంద్ర మంత్రిని కోరారు. విజయవాడ మెట్రోను అమరావతికి అనుసంధానం చేయాలని, ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రతిపాదనలు పంపామని కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ కు నారాయణ తెలియజేశారు.

===================

అనకాపల్లి జిల్లాలో ఉన్న అన్ని ఆర్టీసీ కాంప్లెక్స్ ల్లో బాలల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం సూచించారు. ఈరోజు జిల్లాలో పర్యటించిన ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, బాలల హక్కుల పరిరక్షణకై కమిషన్ తీసుకుంటున్న చర్యలను వివరించారు. అదే విధంగా చీరాలలో పర్యటించిన కమిషన్ రాష్ట్ర సభ్యురాలు బత్తుల పద్మావతి మాట్లాడుతూ పాఠశాలల్లో జీరో డ్రాపవుట్స్ లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని వివరించారు. (వాయిస్.. )

(వాయిస్ 31 సెకన్లు)

===================

ఓటు హక్కు వినియోగ ఆవశ్యకతపై ఓటర్లను చైతన్యపరచడంలో కృషి చేసిన మీడియా సంస్థలకు, మీడియా అవార్డులు-2024 పేరిట భారత ఎన్నికల సంఘం అవార్డులను ప్రధానం చేయనుంది. దీని కోసం వివిధ మీడియా సంస్థల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తోందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. 2024 సంవత్సరానికి సంబంధించి 2025 జనవరి 25 జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులను ప్రధానం చేయనున్నామని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.